ఇది ఖడిల్కర్ బహుమతి తెచ్చిన నవల అయినా, జనబాహుళ్యంలో ఆయనకు పేరు తెచ్చినది 'రూపక కథ.' ఇందులో ధ్వని ప్రధానం. దండి సత్యాగ్రహ యాత్ర గురించి వ్రాసిన 'సాగర! అగస్త్య అలా' దానికి ఉదాహరణ. వ్యంగ్యంతో కథా విషయాన్ని సూచిస్తారు. ఉపమానాలు, రూపకాలుతో కథను కవితలా నడపడం ఆయనకు సహజ విద్య.

''భౌతిక, ఆత్మిక ప్రపంచాలమధ్య సమతూకం వుండాలి'' అంటారు ఆయన.

జాతీయోద్యమంలో పాల్గొన్నారు. షిరోడే గ్రామంలో బడి పంతులుగా జీవించారు. కథారచయితగా, నవలా రచయితగా విశేషప్రఖ్యాతి పొందేరు.

''నేను విచారపడవలసిన దేమీ లేదు.'' అన్న పూర్ణ సంతృప్తితో తమ 78 వ ఏట, 1976 లో కన్నుమూశారు, శ్రీ వి. ఎస్. ఖడిల్కర్. ఆయన జ్ఞానపీఠ బహుమతిని తెచ్చిన 'యయాతి'ని క్రి. శే. జగన్నాథ్ తెనిగించారు. అముద్రితం.

# 'బ్లాక్ అవుట్'

**కథానిక**

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

పాతకాలం వారు సినిమాకు వెళ్ళడం అరుదు. ముఖ్యంగా మా నాన్న గారు చూసిన సినిమాలు వేళ్ళమీద లెక్కపెట్ట వచ్చు. ఎప్పుడైనా మంచి సినిమా వచ్చినప్పుడు బ్రతిమాలితే, ఆయనకి మూడ్ వుంటే వస్తారు.

ఆ రోజు ఏ కళనున్నారో, సినిమాకి రమ్మని పిలిస్తే వెంటనే బయలుదేరారు. ఇంగ్లీషు సినిమా అది. పేరు, 'వేర్ వర్ యు వెన్ ది లైట్స్ వెంట్ అవుట్' (లైట్లు పోయినప్పుడు నువ్వెక్కడున్నావ్?)

కరెంటు పోవడం మనకి సర్వసాధారణం గాని, న్యూయార్క్ మహానగరంలో, విద్యుత్ సరఫరా పోవడం ఎన్నడో గాని జరగనిది. కరెంట్ లేని ఆ నగరం, నిప్పు ఇంకా కనుక్కో బడని పాత రాతి యుగంలా అనిపిస్తుంది.

1965లో విద్యుత్ సరఫరా కొన్ని గంటల పాటు స్థంభించినప్పుడు, న్యూయార్క్ నగరంలో జరిగిన సన్నివేశాలనేకం కలిపి కథగా అల్లి ఆ సినిమా తీసారు.

టిక్కెట్లు కొనుక్కొని వెళ్ళాం. న్యూస్ రీల్ తరువాత సినిమా మొదలైంది. నవనాగరికంగా, విద్యుత్ ద్వారా అనేక యంత్రాలు పనిచేయించి తమ శ్రమని తప్పించుకొనే ఆ నగరవాసులు విద్యుత్ లేకుండా పడే అవస్థలు అద్భుతంగా చిత్రీకరించిన ఆ సినిమాలో లీనమై పోయాం.

ఇంతలో హఠాత్తుగా కరెంటు కట్ అయిపోయింది. తెరమీద బొమ్మ అదృశ్యమై పోయింది. కరెంటు పోయింది!

ఇప్పుడొస్తుందంటే ఇప్పుడొస్తుందని గంట పైనే వేచిచూశాం. తర్వాత గేట్ పాస్ తీసుకొని ఇంటి దారి పట్టాం. మర్నాడు ఏ ఆటయినా చూడొచ్చుట.

ఇంటికి చేరుకున్న తరువాత లైట్లొచ్చాయి. మళ్ళీ ఆ సినిమా చూసే అవకాశం కల్గలేదు మాకు, ఆ రోజే ఆఖరు ఆ సినిమా.